మల్లంపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలి



కూకట్‌పల్లి డీఎం హరికి వినతిపత్రం అందజేస్తున్న లచ్చిరాజు

దుండిగల్: మల్లంపేట వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ప్రణీత్ ప్రణవ్ బ్లూమ్స్ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి కోలా లచ్చిబాబు కోరారు. ఈ మేరకు కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం లచ్చిబాబు మాట్లాడుతూ వేవ్‌రాక్, మెహదీపట్నం నుంచి ప్రగతినగర్ కమాన్ వరకే బస్సులు వస్తున్నాయని, అక్కడి నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లంపేట వరకు బస్సులు నడిపించాలన్నారు. దీనిద్వారా మార్గమధ్యంలో ఉన్న భౌరంపేట, శంభీపూర్, మల్లంపేట ప్రాంతాల్లోని ఎంతోమంది ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా భౌరంపేటలోని ప్రణీత్ బ్లూమ్స్ వద్ద బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందించి 3 రోజుల్లో స్థానికంగా పర్యటించి బస్ సర్వీస్ పొడిగింపు విషయంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లచ్చిరాజు తెలిపారు.

‘రోడ్డు ఆక్రమణను అడ్డుకోవడంలో అధికారుల విఫలం’



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భోజనం చేస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

నిజాంపేట్: రోడ్డు ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ ఆరోపించారు. ఈ మేరకు నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భోజనం చేస్తూ బుధవారం నిరసనకు దిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాచుపలి నుంచి మల్లంపేట్ రోడ్డు మార్గంలోని సర్వే నంబర్ 39, 38, 54లో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆక్రమణలు తొలగించి రోడ్డును పునరుద్ధరించాలన్నారు. ఈ విషయమై హెచ్ఎండీఏ అధికారులు గత నెల 13న ఉత్తర్వులు జారీ చేసినా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో కమిషనర్ వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణతో మల్లంపేట్ ఔటర్ ఎగ్జిట్ నుంచి బాచుపల్లి వరకు తీవ్రంగా ట్రాఫిక్ జాం అవుతోందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని లేకుంటే స్థానిక ప్రజలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంబరి ఆంజనేయులు, పీసరీ కృష్ణారెడ్డి, అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



కలశ పూజలో పాల్గొన్న వేద పండితులు

కుత్బుల్లాపూర్: చింతల్ ద్వారకాపురి కాలనీలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి సహిత వాయులింగ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్థాపిత పూజలు, శ్రీసుబ్రహ్మణ్యస్వామి మూల మంత్ర హవనం, సాయంత్రం 4 గంటలకు శయ్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 7.30 గంటలకు స్థాపిక దేవతలకు పూజలు, 9.15 కు యంత్రపూజ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త కామాక్షి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హంపీ విరూపాక్ష వి ద్యారణ్య పీఠాధిపతి భారతీ మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిష్ఠాపన చేయనున్నారని పేర్కొన్నారు.

పుర మహిళలకు చేయూత

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆర్థిక స్వావలంబనకు రూ.51 కోట్లు

- మహిళా శక్తి కింద గ్రూపు, వ్యక్తిగత రుణాల పంపిణీ
- కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- 13 పురపాలక సంఘాల్లో 7,245 మహిళా సంఘాలు



సాక్షి,సిటీబ్యూరో: పురపాలక సంఘాల్లోని పేద మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పేద మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా వివిధ ఉపాధి సంస్థలు, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.51 కోట్లు ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జిల్లాలోని పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాల్లో 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించేందుకు గాను రూ.51 కోట్లు ఆర్థిక సాయాన్ని అందజేసేందుకు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో 13 పురపాలక సంఘాల పరిధిలోని 130 గ్రూపులకు ఉపాధి కల్పనలో భాగంగా రూ.26 కోట్లు వెచ్చిస్తారు. వ్యక్తిగతంగా నిరుపేద మహిళలు చిన్న తరహా ఉపాధి సంస్థల ఏర్పాటుకు సంబంధించి 900 మందికి రూ.25 కోట్లు అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం లబ్ధిదారులను గుర్తించే పనిలో నిమగ్నమైంది.

ఉపాధి సంస్థలివీ..

గ్రూపు సంస్థల్లో క్యాంటీన్లు, మీ సేవా కేంద్రం, ఈవెంట్ మేనేజ్మెంట్, స్ట్రీట్ వెండర్ కలెక్టివ్స్/ కోల్డ్‌స్టోరేజీ యూనిట్లు, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తదితరాలు ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో కూరగాయలు, పండ్ల దుకాణాలు, బేకరీ, డెయిరీ, డెయిరీ ప్రొడక్ట్స్, మైక్ సెట్స్, సౌండ్‌సెట్స్, బ్యూటీ వెల్‌నెస్ సెంటర్లు, టెంట్ హౌస్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణ జనరల్ స్టోర్, ఫుడ్‌కు సంబంధించిన దుకాణాలు ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



కొలన్ హన్మంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నిజాంపేట్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో పలు కాలనీలు, బస్తీల ప్రజలు పలు సమస్యలపై బుధవారం వినతులు అందజేశారు. తమ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటి సరఫరా, వీధి లైట్లు వేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, యాదగిరి, మానెయ్య, భిక్షపతి, బ్రహ్మచారి, మధు తదితరులు ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న డీఐఈఓ కిషన్

సుభాష్‌నగర్: గతేడాదితో పోలిస్తే ఈయేడు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని మేడ్చల్ డీఐఈఓ కిషన్ సూచించారు. బహదూర్‌పల్లిలోని కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లు, టీచింగ్ డైరీలు, గతేడాది ఫలితాలు, సెంట్రల్ మార్క్స్ రిజల్ట్స్‌ను పరిశీలించారు. తరగతులకు సరిగా హాజరు కాని విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ.. మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు సమాయత్తం కావాలని, 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంపేట్: రాజీవ్‌గృహకల్పలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని అవమానించిందని ఆరోపిస్తూ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు నిజాంపేట్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాజీ నాయక్, సుజాత, నాయకులు సాంబశివారెడ్డి, ముత్యాలు, భిక్షపతి, రవీంద్రారెడ్డి, స్వామి, కురుమూర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో లైబ్రరీని ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కోరారు. ఈ మేరకు మేడ్చల్‌లోని తన కార్యాలయంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగులూరి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చినట్లు ఐలయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్, ఫన్నీ యాదవ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోర్ వేసి.. వదిలేశారు..!



శ్మశాన వాటిక నుంచి ఎంపీపీఎస్ రోడ్డులో ఉన్న బోరు

రంగారెడ్డినగర్: సంజయ్‌గాంధీనగర్‌లోని హిందూ శ్మశాన వాటిక నుంచి ఎంపీపీఎస్‌కు వెళ్లే మార్గంలో గతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బోరు వేశారు. అయితే సదరు బోరుకు మోటార్ బిగించడంలో అధికారుల నిర్లక్ష్యమో.. లేక బోరు ఫెయిల్ అయిందా ఏమో.. కానీ అలాగే వదిలేశారు. దీంతో రోడ్డు మీద అడుగు ఎత్తులో బోరు పైపులైన్ ఉండి రాకపోకలకు ఆటంకంగా మారింది. ఈ విషయమై స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు వినతులు సమర్పించినా తమ పరిధి కాదన్నట్లుగా ఇరు శాఖల అధికారులు తప్పించుకునే ధోరణి అవలంభిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో బోరు పైపును గుర్తించని పలువురు వాహనదారులు ఢీకొని గాయపడ్డా ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాకపోకలకు అడ్డుగా ఉన్న బోరు పైపును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం



అనూష

కుత్బుల్లాపూర్: సూపర్ మార్కెట్‌కు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని ధన్వశ్రీ హోమ్స్ ప్రాంతానికి చెందిన అనూష (38) ఈనెల 8న సాయంత్రం 5 గంటలకు సమీపంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్ లేదా 8712662348 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని మహిళ హత్య



చింతల్: గుర్తు తెలియని మహిళను హత్య చేసిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని హెచ్ఎంటీ పరిశ్రమ గేట్ ఎదుట మహిళ మృతదేహం ఉందని, సదరు మహిళకు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, ముఖం, ఒంటిపై గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం సాయంత్రం వరకు సదరు మహిళ ఆచూకీ వివరాలు తెలియలేదని వారు పేర్కొన్నారు. కాగా మహిళపై లైంగిక దాడి చేశారా..? లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మీర్‌పేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెస్ రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం వేంకటేశ్వ నగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఫోన్లు, టీవీలు, ట్యాబ్స్‌ను విద్యార్థులు ఎక్కువగా చూడడం వల్ల కంటి చూపు మందగించి చదువుపై శ్రద్ధ తగ్గుతోందన్నారు. సుమారు 1500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శాలిని, శ్రావణి, సీఈసీ నరేందర్, లయన్ నారాయణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రిమి సంహారక మందుల వాడకంతో అనర్థాలు

- శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.రాజిరెడ్డి
- పొన్నాల్‌లో కూరగాయల రైతులతో ముఖాముఖి

శామీర్‌పేట్: మోతాదుకు మించి క్రిమి సంహారక మందుల వాడకం అనర్థదాయకమని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డా.రాజిరెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామంలో విశ్వవిద్యాలయ కూరగాయల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో కూరగాయల సాగు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ డా. రాజిరెడ్డి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎఫ్‌పీఓ (కమిటీ)గా ఏర్పడి ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. కూరగాయలు ఎక్కువగా సాగు చేసే పొన్నాల్, బాబాగూడ గ్రామాలను దత్తత తీసుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వర్సిటీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం తీగ జాతి కూరగాయల్లో వైరస్, తెగుళ్ల, పురుగులు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై చర్చించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. భగవాన్, పరిశోధన సంచాలకులు డా. లక్ష్మీనారాయణ, జోనల్ హెడ్ డా. సురేష్ కుమార్, కూరగాయల పరిశోధన హెడ్ డా. అనిత, డీహెచ్ఎస్ఓ శ్రీధర్, ఉద్యాన అధికారి శిల్ప, డా. నిఖిల్, ఉమ్మడి శామీర్‌పేట మండల ఉద్యాన అధికారి రేణుక, పొన్నాల్, బాబాగూడ, బొమ్మరాశిపేట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

16 నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 19 వరకు సీఎం కప్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో యోగా, చెస్, జూడో, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. కీసర ఓఆర్ఆర్ ప్రాంతంలో సైక్లింగ్, లాలాగూడలో బాక్సింగ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక ఉంటాయన్నారు. ఓల్డ్ ఆల్వాల్‌లో స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయన్నారు. 18న కబడ్డీ, అథ్లెటిక్స్, ఉప్పల్ భగాయత్‌లో బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఉప్పల్ జడ్పీహెచ్ఎస్‌లో కిక్ బాక్సింగ్, ఆల్వాల్ పల్లవి స్కూల్‌లో నెట్ బాల్, 19న జింఖానా గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ సెలక్షన్లు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్లతో పాటు పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి మెమో, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9912770801, 7660919518 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. గైర్హాజరయ్యారు. పలు విభాగాల్లో పని చేస్తున్న వీరు సమ్మెలోకి వెళ్లడంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతోంది. సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, ఇప్పటివరకు పేస్కేల్ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు జగదీశ్వర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కాయిస్‌ను సందర్శించిన విద్యార్థులు



నిజాంపేట్: దుండిగల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బుధవారం విహార యాత్రకు వెళ్లారు. ప్రగతినగర్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్‌లో జరిగే కార్యకలాపాలు, తుఫాన్ సందర్భంగా జారీచేసే హెచ్చరికలు తదితర అంశాలను అధికారులు వివరించారు. వారి వెంట కార్పొరేటర్ రావుల శేషగిరి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి విఘ్నేష్, అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.